క్లుప్తంగా

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



శావల్యాపురం: మధ్యాహ్న భోజన పథకం మెను ప్రకారం అమలు చేయాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలకుంట, పోట్లూరు గ్రామాల్లోని ఎంపీపీ స్కూళ్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పీఎం గోరుముద్దా పథకాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పారదర్శకంగా అమలు చేయాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన వంటకాలతో పాటు పోషకాలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి నిర్వాహకులకు తగు సూచలను చేశారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజారమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు గణపవరం విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: గణపవరం సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. గణపవరం ఎస్‌బీఐ బ్యాంకు రోడ్డు, సాయిబాబా గుడి రోడ్డు, చిలకలూరిపేట డొంక రోడ్డు, తిరుమల లక్ష్మీ రైస్ మిల్లుతో పాటూ సాతులూరు ఇండస్ట్రీ, దొండపాడు, చందవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జనవిజ్ఞాన వేదిక సభ్యత్వాల నమోదు ప్రారంభం

చిలకలూరిపేటటౌన్: జనవిజ్ఞాన వేదిక సభ్యత్వాల నమోదు ప్రక్రియ నియోజకవర్గంలో ప్రారంభమైంది. ఈ మేరకు సభ్యత్వ నమోదుకు సంబంధించిన కరపత్రాలను జేవీవీ ప్రతినిధులు శుక్రవారం ఆవిష్కరించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దార్ల బుజ్జిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకులు ఏవీ శివయ్య, డాక్టర్ పీవీ సుబ్బారావు, చుక్కా విన్సెట్‌పాల్ పాల్గొని ప్రసంగించారు. కులమతాలకు అతీతంగా జేవీవీ సభ్యులుగా చేరవచ్చన్నారు. చిలకలూరిపేట డివిజన్ పరిధిలో 400 సభ్యత్వాల నమోదు చేసే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వెల్లడించారు. జూలై మాసం 15వ తేదీలోగా సభ్యత్వాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ డీవీజన్ ఉపాధ్యక్షులు ఉన్నవ రాజేష్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

12న యడ్లపాడు మండల సమావేశం

యడ్లపాడు: సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారిగా మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన జులై 12వ తేదీన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం వెల్లడించారు. ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉంటుందన్నారు. మండల పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, ఎంపీపీ అనుమతితో ఇతర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున గౌరవ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు. అలాగే వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



వినుకొండ(నూజెండ్ల): మండల వనరుల కేంద్రంలో డేటాల్‌బనేగా స్వాస్థ్య ఇండియా (డీబీఎస్ఐ) కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని 54 మంది ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించి టీచర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా ఏఎంవో పి.శ్రీనివాసరావు హాజరై విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు వైరస్ వ్యాప్తి వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోజ ప్రుల్లా తోపాటు నోడల్ టీచర్లు పాల్గొన్నారు.

డయేరియా రాకుండా జాగ్రత్తలు పాటించండి

ఎంపీడీవో కవితా చౌదరి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: 0–5 సంవత్సరాల లోపు చిన్నారులకు వ్యాపించే డయేరియా వ్యాధి నియంత్రణకు మండల, గ్రామస్థాయి అధికారులు అందరు సమిష్టిగా పని చేయాలని ఎంపీడీవో కొత్రపాటి కవితాచౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సారథ్యంలో డయేరియా వ్యాధి రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న తాగు నీటి పథకాలు, చేతి పంపులు, బావుల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 16 వరకు మండలంలోని అన్నీ గ్రామాల్లోని ఆరోగ్య , ఆశ, అంగన్‌వాడీ, కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు అందరూ సమన్వయంతో ఇంటింటి సర్వే చేసి వ్యాధి ఉన్న వారిని గుర్తించి సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించటంతో పాటు ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లుతో పాటు జింకు మాత్రలు అందజేయాలన్నారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని సత్వరమే ఆరోగ్య కేంద్రానికి తీసుకుని రావాలన్నారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటు పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. మురుగుకాల్వల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఆరు మోటర్లు చోరీ

- సొలసలో 5హెచ్‌పీ మోటర్లు –4
- చెంఘీజ్‌ఖాన్‌పేటలో 1.5 హెచ్‌పీ మోటర్లు –2



సొలస గ్రామంలోని వెంకట్రావుకు చెందిన జామతోటలో మోటర్ మాయమైన ప్రదేశం

యడ్లపాడు: పంటపొలాల్లోనూ, రక్షిత మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన సబ్‌మెర్సిబుల్ విద్యుత్ మోటర్లు చోరీకి గురయ్యాయి. రాత్రికి రాత్రే రెండు గ్రామాల్లో సుమారు రూ.4 లక్షలకు పైగా విలువైన ఆరు మోటర్లు మాయం కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని సొలస గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మద్దూరి శ్రీనివాసరెడ్డి తమ గ్రామంలో సాగు చేస్తున్న నిమ్మతోటలో నీటి తడులు అందించేందుకు 5 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటర్లు ఏర్పాటు చేశాడు. ఇదే గ్రామంలోని జామతోటను సాగు చేస్తున్న వెంకట్రావు అనే రైతు తన పొలంలో నీటి వసతి కోసం 5హెచ్‌పీ సామర్థ్యం గల మోటారు బిగించాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం ఇద్దరు రైతులు తమ పంటచేలకు వెళ్లగా మోటర్లు, నీటి పైపులు, వాటికి అనుసంధానం చేసిన విద్యుత్ తీగలు కనిపించలేదు. వీటి విలువ రూ.2.80 లక్షలు ఉంటుదని తెలిపారు.

చెంఘీజ్‌ఖాన్‌పేటలో...

గ్రామ పంచాయతీ రక్షిత నీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు ఎక్కించేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 1.5 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటర్లు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన పంచాయతీ సిబ్బంది పథకం వద్దకు వెళ్లి చూడగా మోటర్లతో పాటు పైపులు, విద్యుత్ తీగలు చోరీ అయినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 1.25 లక్షలు ఉంటుందని చెప్పారు. దీంతో బాధితులందరూ కలిసి యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

సీసీఆర్సీ కార్డులతో ఎన్నో లాభాలు

రొంపిచర్ల: కౌలు రైతులు సీసీ ఆర్సీ కార్డులు తీసుకుంటే విత్తనాలు, ఎరువులు, ఈ–క్రాప్ నమోదు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి శివ లలిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బుచ్చిబాపన్నపాలెం, రొంపిచర్ల గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ సీసీ ఆర్సీ కార్డులు పొందడం వల్ల కౌలు రైతులకు పలు ప్రయోజనాలు చేకూరతాయన్నారు. కారుపై భూ యజమానికి సమకూరే ప్రయోజనాలు కౌలు రైతులకు కూడా కలుగుతాయన్నారు. అలాగే ప్రభుత్వమే కౌలు రైతులు పండించిన పంట దిగుబడులను మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. పంట నష్టాలు కలిగినప్పుడు నష్టపరిహారాన్ని ప్రభుత్వం నేరుగా కౌలు రైతు బ్యాంక్ అకౌంట్లో జమ చేస్తుందన్నారు. దరఖాస్తుపై భూ యజమానులు కౌలు రైతులు సంతకాలు చేయాలని, అలాగే ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన పాస్ బుక్, జిరాక్స్ జతపరచాలన్నారు. వీఆర్వోల లాగిన్‌లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, వీ ఏ ఏ లు, పలువురు కౌలు రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.

ఓవైసీ నివాసంపై దాడులు తగదు

నరసరావుపేట: జై పాలస్తీనా అన్నందుకు ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ నివాసంపై అర్ధరాత్రి దుండగులు దాడి చేయడం సిగ్గుమాలిన చర్యని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని తాము ఖండిస్తున్నామన్నారు. జాతిపిత మహాత్మాగాంధీని చంపిన హంతకులకు వత్తాసు పలుకుతూ, గాడ్సేను స్మరించే వారు, పొగిడే వాళ్లు దేశాన్ని పాలించవచ్చు కానీ, మన దేశానికి మిత్రదేశంగా ఉండే పాలస్తీనాకు మద్దతుగా జై పాలస్తీనా అన్నందుకు ఆకాశం ఊడిపడ్డట్లు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో పాలస్తీనలో అమాయక ప్రజలు చనిపోతున్న నేపథ్యంలో యావత్తూ ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాధినేతలు నేతలు, ప్రజాస్వామికవాదులు పాలస్తీనాకు మద్దతు పలుకుతున్నారన్నారు. దేశంలో ఎన్నో సమస్యలను పక్కనపెట్టి, ఈ అంశాన్ని భూతద్దంలో పెట్టి బీజేపీ, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్‌లు తమ ఉనికిని చాటుకునేందుకు రాజకీయ దుమారాన్ని సృష్టించటం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఓవైసీ నివాసం వద్ద కట్టుదిట్టమైన మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు వినుకొండ మునిసిపల్ సమావేశం

వినుకొండ (నూజెండ్ల): స్థానిక మునిసిపల్ సమావేశం హాలులో ఈనెల 29వ తేదీన సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. ఉదయం 11:30 జరిగే సమావేశంలో మున్సిపల్ కాంప్లెక్సుల నిర్మాణంపై చర్చతోపాటు, పురపాలక సంఘంలో నెలకొన్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి వార్డు కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

2న క్యాంపస్ ఇంటర్వ్యూలు

మాచర్ల :పల్నాడు జిల్లా మాచర్ల గురుకుల పారిశ్రామిక శిక్షణ సంస్థలో జులై 2వ తేదీన ఉదయం 10 గంటలకు జరిగే క్యాంపస్ ఇంటర్వ్యూలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపల్ సీహెచ్ఎన్‌వీ ప్రసాద్ బాబు శుక్రవారం కోరారు. జులై 24న పరీక్షలకు హాజరవుతున్న వారు అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

ప్రతిఒక్కరూ పరిశుభ్రమైన నీరు తాగాలి

అవగాహన సదస్సులో డాక్టర్లు



అతిసారపై వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

రొంపిచర్ల: డయేరియాను నివారించేందుకు ప్రతి ఒక్కరూ భోజనమునకు ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన నీరు తాగాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ సాయిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అతిసార వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుత కురుస్తున్న వర్షాలకు అతిసార వ్యాధి ప్రబలే అవకాశముందని అన్నారు. అతిసార వ్యాధిబారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రతి గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలల్లో పిల్లలకు, తల్లులకు అతిసార వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. వచ్చే నెల ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు ఐడీసీఎఫ్ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఎవరికైనా అతిసార వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాలలో సంప్రదించాలన్నారు. అనంతరం కార్యక్రమాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎండీఓ సీహెచ్.లక్ష్మీకుమారి, ఎంఈవో భ్రమరేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ రామాంజనేయరెడ్డి, ఈవోపీఆర్డీ శివరామకృష్ణ, కిరణ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌కు బంగారుబాట వేయాలి



గణపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో కృష్ణారెడ్డి, హెచ్‌ఎం మారుతిరావు

నాదెండ్ల: తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని ఎంఈవో–2 ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. గణపవరం అంబేద్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఆలోకం మారుతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఆర్‌పీలు భవాని, శ్రీలక్ష్మీ, ఉపాధ్యాయులు జయపాల్, అరుణ, రజిని, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమంలో తల్లిదండ్రులు, చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల పునః ప్రారంభం అయిన నాటి నుంచి జులై 13 వరకూ ప్రతి పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు భారీగా చేరుతున్నారని, ప్రస్తుతం ఆన్‌లైన్ నమోదు జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మౌలిక వసతుల కల్పనతో పాటూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం, స్టూడెంట్ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త భరత్‌కుమారి పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే నగర పంచాయతీ అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ

దాచేపల్లి: నగర పంచాయతీ అభివృద్ధి అందరి బాధ్యత అని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నగర పంచాయతీ సచివాలయంలో కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పలు అంశాలపై కౌన్సిల్ తీర్మానం చేసి ఆమోదం పొందారు. చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ.. నగర పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. డయేరియా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటివి రాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. బాధితులకు వైద్య సిబ్బంది తగిన సేవలు అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఓ నాగయ్య సేవలు అభినందనీయం

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో విద్యాభివృద్ధికోసం 39 సంవత్సరాల పాటు అమూల్యమైన సేవలందించిన వేముల నాగయ్య కృషి ఎనలేనిదని ఎంపీడీఓ సరోజినీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న విద్యాశాఖాధికారి వేముల నాగయ్య దంపతులను సన్మానించాక సరోజనీదేవీ మాట్లాడారు. అన్ని వృత్తుల వారిని తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి ఎంతో అమూల్యమైనదని పేర్కొన్నారు. అలాంటి ఉపాధ్యాయుడిగా, విద్యా శాఖాధికారిగా వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో ఎంతో మంది చిన్నారులకు విద్యాబోధన అందించారని తెలిపారు. వారిని ఉన్నత స్థానంలో నిలబెట్టడమే కాకుండా విద్యాశాఖాధికారిగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేసిన సేవలు అమూల్యమన్నారు. సన్మాన గ్రహీత, ఎంఈఓ వేముల నాగయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజ సేవ చేయాలని తనకు ఆలోచన ఉండేదని, అప్పుడే ఉపాధ్యాయుడిగా అవకాశం రావడంతో పేదలకు సాయం చేశానని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి గబ్రూ నాయక్, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు, కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, టీపీ సత్యనారాయణ, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడి: ఒకరికి గాయాలు



గాయాలపాలైన బాధితుడు రేళ్ల వెంకయ్య

పిడుగురాళ్ల: మతిస్థిమితం లేని వ్యక్తి దాడి చేయడంతో ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని జానపాడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రేళ్ల వెంకయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని పేరయ్య దాడి చేశాడు. వెంకయ్య కాలిపై గడ్డపారతో పేరయ్య పొడిచాడు. పేరయ్యకు మతి స్థిమితం లేక వైజాగ్‌లో కొన్నాళ్లు చికిత్స పొందినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు.

5 గంటల నుంచే పింఛన్ పంపిణీ చేయాలి

- ఎంపీడీవో వై.శ్రీనివాసరావు
- పెన్షన్ పంపిణీపై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

యడ్లపాడు: మండలంలోని సామాజిక భద్రత పెన్షన్ దారులకు వచ్చే నెల ఒకటో తేదీన ఉదయం 5 గంటలకే ప్రారంభించాలని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెన్షన్ పంపిణీ ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ యడ్లపాడు మండలంలోని 12 గ్రామ సచివాలయాలలో 273 క్లస్టర్లు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 8073 మంది పెన్షన్ దారులు ఉండగా, వారికి పెన్షన్ కింద రూ.5,43,12,500 నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క పెన్షన్ దారుడికి రూ.7వేల చొప్పున ప్రభుత్వ ఉద్యోగులే పెన్షన్ పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఒక్కొక్కరికీ 3,4 క్లస్టర్లను అనుసంధానం చేసి కనీసం 50–60 మందికి పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇలా అందరూ సమన్వయంగా జులై ఒకటో తేదీన విధిగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ కానుకను అందిస్తారన్నారు. సాయంత్రానికి 95శాతం పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆరోజు అందుబాటులో లేని లబ్ధిదారులకు మరసటి రోజు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధుని, ఏవో సాయి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతుకు మేలు

వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు



మాట్లాడుతున్న ఏవో నరేంద్రబాబు

నరసరావుపేట రూరల్: కౌలురైతులు పంట సాగుదారు కార్డులు (సీసీఆర్‌సీ) తీసుకోవడం ద్వారా ప్రభుత్వం పథకాలను పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో పంట సాగుదారు కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగుదారు కార్డు వలన భూ యజమాని హక్కులకు ఎలాంటి భంగం కలగదని తెలిపారు. కౌలుదారులకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు, పంట రుణం, పంట బీమా, సబ్సిడీ పథకాలు, పంట కొనుగోలుకు ఈ కార్డు ఉపయోగపడుతుందని వివరించారు. కౌలు రైతులు ఆర్‌బీకేలోని వ్యవసాయ సహాయకుని వద్ద సీసీఆర్‌సీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి దరఖాస్తును పరిశీలించి అర్హులైన వారికి కౌలుదారు గుర్తింపు కార్డులు అందజేస్తారని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఇండ్లమూరి రామారావు, వీఆర్‌వో డి.శివనాగిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

స్వర్ణ నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం



హైదరాబాదులో స్వర్ణ నాగరాజుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న హెచ్ఎస్‌సీ ప్రతినిధులు

నరసరావుపేట: సేవా కార్యక్రమాలు చేస్తూనే ఆ కార్యక్రమాలను విస్తరించేందుకు మా చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో పేదలు, యాచకులకు రాత్రి వేళ ఆహారం అందించి ఆకలి తీరుస్తున్న తన సేవలను గుర్తించిన అమెరికాకు చెందిన హోలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్ (హెచ్.ఎస్.సి యూనివర్సిటీ) డాక్టరేట్ ప్రదానం చేసిందని స్వర్ణనాగరాజు శుక్రవారం పేర్కొన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో యూనివర్సిటీకి చెందిన శాఖ భవనంలో యూనివర్సిటీ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్‌కుమార్ సత్కరించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. నేటి యువకులు తనను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వక్తలు ఉద్బోధించారన్నారు. తాను జర్నలిస్టు వృత్తిలో రాత్రి సమయంలో బయట తిరిగే క్రమంలో యాచకులు, ఏ ఆధారం లేని వృద్ధులు పడుతున్న అవస్థలు చూసి ఆవేదనకు గురయ్యానని, రాత్రి సమయంలో ఆహారం దొరకక నీటితో కడుపు నింపుకుంటున్న యాచకుల దయనీయ పరిస్థితి తనను కలిచి వేసిందన్నారు. కొద్దిపాటి ఆదాయం మొత్తాన్ని యాచకుల ఆకలి తీర్చేందుకు వెచ్చిస్తున్నానని, దీనిని గమనించిన మిత్రులు కొందరు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. దీనిని గుర్తించిన హెచ్.ఎస్.సి యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. డాక్టరేట్ దక్కడం సేవా కార్యక్రమాల పట్ల బాధ్యతను మరింత పెంచిందన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



మాజీ ప్రధాని పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

నరసరావుపేట ఈస్ట్: భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 103వ జయంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి పీవీ చేసిన సేవలను, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఆయన తీసుకువచ్చిన సంస్కరణలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాదు, సంఘం కార్యదర్శి కె.వి. పురుషోత్తమరావు, కోశాధికారి విష్ణుబొట్ల మధు, శారదా స్మార్త పురోహిత సంఘం అధ్యక్షుడు కోట సుబ్రహ్మణ్యం, కోట సాంబశివరావు, బొగ్గరం ఫణిరాజకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీసర్వేపల్లి బ్రాహ్మణ ఉద్యోగ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ధర్మవరపు విజయకుమార్, కార్యదర్శి తుర్లపాటి సత్యనారాయణ, భాగవతుల లక్ష్మీనారాయణబాబు, డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సింధూజ పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ ముఖ్యం



హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి కేవీ ప్రవీణ్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది శ్రద్ధ వహించాలని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కేవీ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలోని హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా గర్భం దాల్చినప్పటి నుంచి ఆర్‌సీహెచ్ ఇంటిగ్రేటెడ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

మాతా శిశు సంరక్షణ కార్డులను అందజేయాలని పేర్కొన్నారు. వారికి చేసిన సేవలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు ప్రతి నెల 9న 4–9వ నెల వరకు తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ద్వారా పరీక్ష చేయించుకోవాలన్నారు. కాన్పు సమయములో 104, 108 వాహనాలను ఉపయోగించి సురక్షితమైన ప్రసవాలు జరిపించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ ఎం. ప్రభాకర్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ సోమేశ్వరరావు, ఏఎన్ఎం కృష్ణకుమారి, ఆశలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.